11

# “మహాబలుడా, నన్ను జ్ఞాపకము చేసికొనుము!”

# (5:19-22)

తన విలాపములను యిర్మీయా ముగించుచుండగా, మూడు సంగతులను చేయుమని అతడు దేవుని విన్నవించుకున్నాడు: జ్ఞాపకముచేసికొనుము, పునరుద్ధరించు, నూతనపరచు:

> యెహోవా, నీవు నిత్యము ఆసీనుడవై యుందువు నీ సింహాసనము తరతరము లుండును. నీవు మమ్ము నెల్లప్పుడును మరచిపోవుట ఏల? మమ్ము నింతకాలము విడిచిపెట్టుట ఏల? యెహోవా, నీవు మమ్మును నీతట్టు త్రిప్పినయెడల మేము తిరిగెదము. మా పూర్వస్థితి మరల మాకు కలుగజేయుము. నీవు మమ్మును బొత్తిగా విసర్జించి యున్నావు నీ మహోగ్రత మామీద వచ్చినది (5:19-22).

ఈ మాటలకు సంగీతం తగిలిస్తే, కీర్తనకు ఈ మూడు విన్నపాలు పల్లవిగా రూపొందుతాయి. అవి నిరీక్షణతో కూడిన విన్నపాలు, దేవుడు తన ప్రజలను తిరిగి స్వీకరించుమనే మనవులు. ఈ విలాపములన్నిటిలోను, ఆయన వారిని విసర్జించినట్టు కన్పించినా, దేవుడు తన ప్రజలను శాశ్వతంగా విసర్జించడని సూచించే నిరీక్షణతో కూడిన క్లుప్త ప్రతిపాదనలను మనం చూచాం. యిర్మీయా మార్గంలో దిగి మనం నడిచిపోదాం. అది బాగుపడే మార్గం. దేవుడు తన మనవులను సఫలం చేస్తాడనే అతని నిరీక్షణను చూద్దాం.

## మమ్మును జ్ఞాపకము చేసికొనుము

దేవుడు యూదాను మరచిపోయాడా? దుష్టుల పాపాన్ని బట్టి ఆయన నీతిమంతులను సహా మరచిపోయాడా? క్షమించడానికి దేవుడు యిష్టపడడేమో అనే సందేహాన్ని యిర్మీయా వ్యక్తం చేస్తున్నాడా? లేక యూదా అక్రమం ఎంత ఘోరమయ్యిందంటే, వారిని శుద్ధీకరించడానికి ఎక్కువ కాలం పడుతుందని అతడు గుర్తిస్తున్నాడా? పోల్చదగిన ఒక విన్నపాన్ని సిలువపైనుండి క్రీస్తు చేశాడు “నా దేవా, నా దేవా, నన్నేల విడనాడితివి?” ఇది కీర్తన. 22:1నుండి కోట్ చేయబడింది (మత్తయి 27:46బి). తాను ఎందుకు ఒంటరిగానే శ్రమ అనుభవించవలసి వచ్చిందో యేసు ఎరుగడా? లేక ఆయన కేవలం మహా వేదనను బయలుపరచుతున్నాడా?

యిర్మీయా విన్నపానికి నిరీక్షణ లేకుండపోలేదు. అతడు దేవుని సర్వాధికారాన్ని

అంగీకరిస్తున్నాడు ఆయన నిరంతరం ఏలువాడైయున్నాడు. దేవునికి జ్ఞాపకం చేసికొనే శక్తి, కార్యం జరిగించే అధికారం ఉంది. ఆయన మాత్రమే సర్వమును వశపరచుకున్నవాడై యున్నాడు. ఆయన సింహాసనము తరతరములకుండును. కాలాలు మారవచ్చు, సంఘటనలు, పరిస్థితులు మార్పుచెందవచ్చు, కాని మారని ఒకే విషయమేమంటే - దేవుని సర్వాధిపత్యపు ఏలుబడి మాత్రం అలాగే ఉంటుంది. ఆయన వాక్యము తరతరములకుంటుంది.

మనవలె దేవుడు కాలాన్ని కొలవడు గనుక, ఆయన మనలను మరచిపోయినట్టు కన్పించవచ్చు. ఆయన తన జనులకు ఎంతగా కావాలో గ్రహింపచేయునట్టు అవసరమైనంతకాలము వారిని విడిచియుంటాడు, కాని ఆయన వారిని మరచిపోడు! వాస్తవానికి, యెరూషలేము కూల్చబడకమునుపే, ఎవరు బాగుపరచబడతారో ఆయన వారిని ముందుగానే జాగ్రత్త చేశాడు. చెరలోనుండి విడిపించబడడం ముందుగానే ఏర్పాటు చేయబడింది. ఆ సంగతి యిర్మీయాకు తెలుసు.

దేవుడు కనుపరచే అక్కర ఏమంటే, తన ప్రజలు తన్ను మరచిపోకుండాలనేది. డెబ్బది సంవత్సరాల చెరకాలంలో వారి విశ్వాసం సజీవంగా నిలపాలని యిద్దరు ప్రవక్తలను ముందుగానే ఏర్పాటు చేశాడు. యెరూషలేము నాశనం చేయబడినప్పుడు, క్రీ.పూ. 586లో, దానియేలు, యెహెజ్కేలు అనేవారు బబులోనులోనే ఉన్నారు. క్రీ.పూ. 606లో, యెరూషలేము తొలిగా పట్టబడినప్పుడు, దానియేలు బబులోనుకు కొనిపోబడ్డాడు. రాజునగరులో ఉండదగినవారికి యిచ్చే ట్రైనింగ్‌లో దానియేలు ఉన్నాడు (దానియేలు 1). తొమ్మిది సంవత్సరాల తరువాత, క్రీ. పూ., 597లో యెహెజ్కేలు కూడ బబులోనుకు వచ్చాడు. రాజు నగరులో దానియేలుకు ఉన్న పలుకుబడిని గూర్చి యెహెజ్కేలుకు బాగా తెలుసు (యెహెజ్కేలు 14:14, 20). అతడు కూడ ఆ దేశంలోనే పనిచేశాడు. యెరూషలేము కాల్చబడిన తరువాత, దేశంనుండి వెళ్లగొట్టబడినవారు బబులోనుకు వచ్చినప్పుడు, ఆ నాశనం ఎందుకు వచ్చిందో యెహెజ్కేలు వివరించాడు. తన పుస్తకంలోని 48 అధ్యాయాలలో 60 కంటె ఎక్కువ సార్లు "నేను యెహోవానైయున్నానని మీరు తెలిసికొనునట్లు" అనే ప్రయోగం ఉపయోగించబడింది. చెర నివాసుల మధ్య దేవుని పనిని సూచించే సందర్భంలో ఎల్లప్పుడు ఈ ప్రయోగం చేయబడింది. వారి దేశము వారి స్వాతంత్ర్యం బాధాకరంగా పోగొట్టుకున్నది కూడ యెహోవాయే దేవుడని వారు జ్ఞాపకము చేసికొనునట్లు కల్పించడానికి ఉద్దేశింపబడింది. వారు పాఠాన్ని మరచిపోలేదు. వారు చెరనుండి తిరిగి వచ్చిన తరువాత, విగ్రహారాధనలో వారెన్నడు పడిపోలేదు.

దేవుని పక్షంగా మాట్లాడుతూ, యెహెజ్కేలు యిలా ప్రకటించాడు: "నీ యౌవన దినములయందు నేను నీతో చేసిన నిబంధనను జ్ఞాపకము తెచ్చుకొని యొక నిత్య నిబంధనను నీతో చేసి దాని స్థిరపరతును ... నేను యెహోవానని నీవు తెలిసికొనునట్లు నేను నీతో నా నిబంధనను స్థిరపరచెదను" (యెహెజ్కేలు 16:60-62). దేవుడు నమ్మదగినవాడు! ఆయన మరచిపోడు! ఇంతకు ప్రశ్నేమంటే - "మనము ఆయనను మరచిపోదుమా?" దేవుని గూర్చి ఆలోచించకుండ మన జీవితాల్లో ఎన్ని దినాలు గడిచిపోయి ఉంటాయి? కేంద్ర స్థానంనుండి బహుదూరంగా మన జీవితాల్లో దేవుని

ఒక మూలకు నెట్టి, అనుదిన జీవితానికి ఆయనతో సంబంధం లేకుండ మనలో ఎందరం జీవించుతుంటాము? దుఃఖపరిస్థితిని ఎదుర్కొన్నప్పుడు మాత్రమే దేవుని ఎందరు వెదకుతూ ఉంటారు? తీవ్రమైన అవసరతలో ఉన్నప్పుడు మాత్రమే డాక్టరును పిలిచేలాగు ఆయనను మనం ఉపయోగింప చూస్తామా?

జనులు దేవుని మరచిపోయే కాలంలో యిర్మీయా జీవించాడు. దేవుడు వారిని మరచిపోకూడదని, విసర్జించవద్దని అతడు విన్నవించుకొనడంలో ఆశ్చర్యము లేదు. ప్రార్థించుట, బైబిలు పఠించుట, ఆరాధించుట అనేవి క్రమమైన అలవాట్లుగా పెంపొరచేసి కొనడంలోని ఒక కారణం – దేవుని జ్ఞాపకముంచుకునేలా అవి మనకు సహాయపడతాయి. మరచిపోవడం ఎంత సులభమో దేవునికి తెలుసు. ఆయన దేవుడైయున్నాడనియు ఆయన యింకను అక్కడే ఉన్నాడనియు సూచించడానికి మార్గం పొడుగున ఆయన సూచనలను నిలిపాడు. ఆరాధించే అవకాశాలను ఉపయోగించుకొనడానికి మనం ఏ మాత్రం శ్రద్ధ చూపకపోయినా, ప్రార్థించాలని అరుదుగా గుర్తు వచ్చినా, తన వాక్యము (బైబిలు) ద్వారా దేవుడు మనతో మాట్లాడడానికి సమయం ఏ మాత్రం తీసికొనకపోయినా, మన శ్రద్ధను ఆయన పొందడానికి తీవ్రమైన చర్యలకు ఆయన పాల్పడవలసి వస్తుంది. గనుక, యెరూషలేము, యూదాల అనుభవంనుండి పాఠాలు నేర్చుకుందాం.

## మమ్మును పునరుద్ధరించుము

పునరుద్ధరణ బైబిలు చర్చనీయాంశమైయుంది. ఏదెను తోటలో ఆదాము హవ్వలు పడిపోయినది మొదలు (ఆది. 3) ప్రకటన గ్రంథంవరకు, దేవుడు తన ప్రజలను తనకు పునరుద్ధరించుకునే పనిలోనే ఉన్నాడు. "పునరుద్ధరణ" అంటే, తిరిగి మొదటి స్థితికి వచ్చి చేరుకొనుట అని అర్థం. భవనాన్ని పునరుద్ధరించడమంటే, అసలైన కట్టువానిచే సాధింపబడిన స్థితికి దాని రూపును దిద్దడం అని అర్థం. కారును పునరుద్ధరించడమంటే, ఫ్యాక్టరీనుండి ఏ స్థితిలో వచ్చిందో తిరిగి అదే స్థితికి దాన్ని నిర్మించడమని అర్థం.

దేవునిచే ఏర్పరచుకొనబడిన దేశంగా యూదాను తన అసలైన స్థానానికి తిరిగి తేవాలని యిర్మీయా విన్నవించుకున్నాడు. యూదా యొక్క వైభవ దినాల్లో ఉన్న జీవిత విధానాన్ని గూర్చి అతడు ఆలోచించుతూ ఉండవచ్చు. దానికంటె బహు ప్రాముఖ్యంగా, ప్రజలు దేవునితో సరియైన సంబంధానికి పునరుద్ధరింపబడాలని అతడు అడుగుతున్నాడు. నీతికిని విశ్వాస్యతకును వారిని పునరుద్ధరించునట్లు అతడు దేవుని కోరుతున్నాడు. చెరనుండి విడిపించి దేశముగా ఆయన పునరుద్ధరించునని అతనికి ముందుగానే తెలుసు. ప్రవచనములున్న తన గ్రంథంలో అతడు యిలా రాశాడు: "– అవి బబులోనునకు తేబడును, నేను ఆ ఉపకరణములను దర్శించి తెప్పించి యీ స్థలములో వాటిని మరల నుంచు కాలమువరకు అవి అక్కడ నుండవలెను; ఇదే యెహోవా వాక్కు" (యిర్మీయా 27:22). తాను యింకను యిలా ప్రకటించాడు: "... అయితే నేను నీకు ఆరోగ్యము కలుగజేసెదను నీ గాయములను మాన్పెదను; ఇదే యెహోవా వాక్కు" (యిర్మీయా 30:17బి). దాని వెంట వచ్చిన వచనంలో, జనులను దేవుడు వారి స్వదేశానికి రప్పించునన్న విషయాన్ని వివరించాడు.

70 ఏండ్ల తరువాత బబులోను కూలిపోయింది. పారసీక దేశపు రాజైన కోరెషు - చెరవాసులు తమ స్వదేశమునకు వెళ్లి పట్టణాన్ని, దేవాలయాన్ని తిరిగి నిర్మించుకొనునట్లు ఆజ్ఞ జారిచేశాడు (ఎజ్రా 1:1-4). "యిర్మీయా ద్వారా పలుకబడిన తన వాక్యమును నెరవేర్చుటకై" యిది జరిగింది. దేవుడు తన వాగ్దానాలను నెరవేర్చునన్న విషయం యిర్మీయాకు బాగా తెలుసు. ప్రజలు ఆ సంగతి తెలిసికోవాలని అతడుకోరాడు. దేవుని చిత్తము ఏదైయున్నట్టు అతడు ముందుగానే ఎరిగాడో దానికొరకు అతడు ప్రార్థించాడు.

"యెహోవా, నీవు మమ్మును నీ తట్టు త్రిప్పినయెడల మేము తిరిగెదము" అనేది నేడు మన ప్రార్థనగా మిగిలిపోవాలి. పునరుద్ధరించబడడమనేది ఒకేసారి జరిగి అంతటితో అది నిలిచిపోయేది కాదు. అది కొనసాగే విధానమైయుంది. దేవుని ప్రజలను ఆయనకు పునరుద్ధరించాలనేది క్రీస్తు ప్రభువు యొక్క పనియైయుంది. క్రొత్త నిబంధన సంఘము యొక్క పని జనాన్ని దేవుని సహవాసానికి పునరుద్ధరించడమైయుంది. నేడు క్రైస్తవులుగా మన పని సంఘానికి నిజమైన శిష్యత్వాన్ని పునరుద్ధరించడం, దేవుడు భూమిమీద ఎలా కోరుకున్నాడో అలా క్రొత్త నిబంధన సంఘాన్ని భూమిమీద పునరుద్ధరించడమైయుంది. ఒక సహోదరుడు దేవునినుండి దూరమై పాపంలో చిక్కుబడియున్నట్టయితే, "సాత్వికమైన మనస్సుతో అట్టివానిని మంచిదారికి తీసికొని రావలెను" (గలతీ. 6:1). దేవుడు కోరిన విధంగా ప్రతీదీ పునరుద్ధరించబడడం లోకమునకు నిరీక్షణయైయుంది.

## మమ్మును నూతనపరచుము

దేవుని ప్రజలకు పునరుద్ధరించబడడం మాత్రమే గాక, నూతన పరచబడడం కూడ అవసరమై ఉంది. పాతది (ప్రాచీనమైనది) పునరుద్ధరింపబడవచ్చు. అయితే పునరుద్ధరింప బడినంత మాత్రాన అది నూతనపరచబడినట్టు కాదు. "మీరు క్రొత్తగా జన్మింపవలెను" అని క్రీస్తు ప్రభువు తెలియజేశారు (యోహాను 3:7). ప్రముఖుడు, యూదుల నాయకుడు దాన్ని గ్రహించడానికి కష్టపడ్డాడు. పాతదాన్ని క్రొత్తదిగా చేయగలవాడు దేవుడే. ఈ నూతనపరచబడడం భౌతికమయ్యింది కాదు. అది ఆత్మ యొక్క అంతరంగపు లేవ్రాయము కలిగించబడడం. దావీదు దేవునితో యిలా విన్నవించుకొన్నాడు: "దేవా, నాయందు శుద్ధహృదయము కలుగజేయుము నా అంతరంగములో స్థిరమైన మనస్సును నూతనముగా పుట్టించుము" (కీర్తన 51:10). దేవుడు మాత్రమే తిరిగి నూతనముగా చేయగలవాడని గుర్తించడం మాత్రమే గాక, మనలో ఆయన చిత్తాన్ని జరిగించబడడానికి మనమాయన కొరకు వేచియుండాలి కూడ. "యెహోవాకొరకు ఎదురు చూచువారు నూతన బలము పొందుదురు; వారు పక్షిరాజులవలె రెక్కలు చాపి పైకి ఎగురుదురు, అలయక పరుగెత్తుదురు, సొమ్మసిల్లక నడిచిపోవుదురు" (యెషయా 40:31).

ఆత్మ సంబంధంగా నూతనపరచబడడం కూడ కొనసాగించు విధానమైయుంది. మేలు చేయుటయందు క్రైస్తవులు అలసిపోయినవారుగా ఉండవచ్చు. శరీరం పోషింపబడి విశ్రమిస్తున్నట్టే ఆత్మ పోషింపబడుతూ విశ్రమించుతూ ఉండాలి; అంతరంగ పురుషునికి, ఆత్మకు దేవుని సముఖములో విశ్రాంతి అవసరం. ఒక సమయంలో ప్రభువైన యేసు తన శిష్యులతో యిలా అన్నారు: "- మీరేకాంతముగా అరణ్య ప్రదేశమునకు వచ్చి,

కొంచెముసేపు అలసట తీర్చుకొనుడి" (మార్కు 6:31). ఆ "ఏకాంత సమయము" తమ దేహములకు విశ్రాంతి మాత్రమే గాక, అది వారి ఆత్మలను ఉజ్జీవింపజేసికొనుటయై యున్నట్టు నేను ఒప్పింపబడుతున్నాను.

నీవు ప్రార్థనలో ఆయనతో మాట్లాడుకునే సమయములో, అనుదినము దేవుని మీద ఆనుకొనుటకు కొంత సమయం తీసికొని ఆయన తన వాక్యం ద్వారా నీతో మాట్లాడనిమ్ము. ఆయనతో నీవు ఎంతకాలం గడుపుతావో, అంతగా ఆయనవలె నీవు మారే అవకాశముంటుంది. వెలుగైయున్న ఆయన ప్రసన్నతలో నీవు ఎంత ఎక్కువగా చలికాచుకుంటావో, అంత ఎక్కువగా ఆయన స్వభావము నీకు సోకుతుంది. దేవుని సముఖములో ఉన్న మోషే ముఖము ఎలా ప్రకాశించిందో (నిర్గమ. 34:29-35), అలాగే దేవుని సముఖములో గడిపే నీవు ఆయన స్వభావాన్ని అలా వ్యక్తపరచగలుగుతావు. దినారంభము - దినాంతము - లేక రెండును యజమానునితో మౌనంగా గడుపు. దేవుడు నిన్ను నూతనపరచుతాడు.

---

## సందేశమేమి?

"దేవా, మమ్మును జ్ఞాపకము చేసికొనుము, మమ్మును పునరుద్ధరించుము, మమ్మును నూతనపరచుము." మరోవిధంగా దుఃఖకరమైన పాటకు తగిన పల్లవి! యిర్మీయా యొక్క ఈ చిన్న ప్రార్థన మన అనుదిన ప్రార్థనలో భాగమైయుండాలి. అతని మాటలు:

మనచుట్టు తుఫానులు విసరుతున్నప్పుడు,
నేను ఒంటరిగా నిలిచి కనిపెట్టుతున్నప్పుడు,
నిప్పుల దుష్టత్వం వీడు చుండగా,
శోధకుల ధ్వని పిలుస్తుండగా,
జీవిత సముద్రంపై నడుస్తున్నప్పుడు,
చెలరేగుతున్న దాని కదలికను అదుపులో ఉంచు;
దాని భయమువలన కృంగిపోతున్నప్పుడు
పాపపు భారం హింసించినప్పుడు
చీకటి వేదన దుఃఖపరచినప్పుడు
మర్త్యమైన జీవిత కాలమంతటితో
మరణ ద్వారము గుండా వెళ్లునప్పుడు
మహాబలుడా! నన్ను జ్ఞాపకము చేసికొనుము,
మహా బలుడా! నన్ను జ్ఞాపకము చేసికొనుము.[1]

కొన్నిసార్లు దేవుడు దూరంగా ఉన్నట్టు కన్పిస్తాడు. మనం అలసిపోయి, విసిగి, నిరాశపడిపోతూ ఉంటాం. లోకం ఎంత వేగంగా తిరుగుతుందంటే, కొంతసేపు దానిలోనుండి క్రిందికి దిగగోరతాం. మార్పులు బహు త్వరితగతిని వస్తూ ఉన్నాయి. వాటితో మనం సర్దుకుపోలేక పోతున్నాం. ఏదియు కదిలించలేని స్థిరమైన పునాదికొరకు మనం కోరుకుంటాం. పునరుద్ధరించే, నూతనపరచే దేవుని శక్తియే ఆలాటి స్థిరత్వం ప్రసాదిస్తుంది. అందుకే పౌలు ఎఫెసీ క్రైస్తవులపట్ల తన ప్రార్థనను యిలా ముగిస్తున్నాడు:

> మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగువాటన్నిటికంటెను, ఊహించువాటన్నిటికంటెను అత్యధికముగా చేయ శక్తిగల దేవునికి క్రీస్తుయేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగునుగాక ఆమేన్ (ఎఫెసీ. 3:20, 21).

లోకము యొక్క రంగుల రాట్నంనుండి క్రిందికి దిగు. నెమ్మదిగా ఉండి దేవుని మాట ఆలకించు. ఎలాగుండాలో ఆయన నీ జీవితాన్ని అలా చేయగలడు. అనుకూలతలు లేని పరిస్థితుల్లో కూడ, ఆయన నీ ఆత్మను తెప్పరిల్లజేసి, నీ జీవితానికి గమ్యాన్ని చూపగలడు. అపరిశుద్ధమైన జీవితపు సాధారణ స్థితినుండి నీ ఆత్మను ఆయన పైకి లేవనెత్తగలడు.

ఒకవేళ నీవు తప్పు చేసినందుకు బాధపడుతున్నావేమో. నీవు శత్రు భూభాగంలోనికి వెళ్లి, లోకము యొక్క ఆకర్షణలకు బలియైపోయావేమో. నీవు శోధింపబడి, వేసారిపోయి, శిక్షింపబడుతున్నావేమో, అయితే నిన్ను జ్ఞాపకం చేసికొని, నిన్ను పునరుద్ధరించి, ఆయన నిన్ను నూతనపరచగోరుతున్నాడు. నీవెప్పుడు ఆయనను లోనికి రానిచ్చినా, నీ హృదయంలో ఆయన నివసించి నీ జీవితంలో ఆయన క్రియ చేయగోరుచున్నాడు.

---

సూచన

[1]Joanna Kinkel, arr., "Remember Me, O Mighty One," *Songs of the Church,* ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishers, 1977).